బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాల సంక్షేమం

సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు గౌడ్



పద్మారావుకు మద్దతు ప్రకటిస్తున్న తెలంగాణ వీరభద్ర కుల సంఘం ప్రతినిధులు

చిలకలగూడ: సబ్బండ వర్గాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని పార్టీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు అన్నారు. సీతాఫల్‌మండిలో శనివారం జరిగిన కార్యక్రమంలో పలు సంఘాలు ఆయనకు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ఏకైక ఎజెండాగా ప్రకటించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ కర్తవ్యంగా భావించి సికింద్రాబాద్‌ను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశామన్నారు. కేవలం ఎన్నికల ముందే వచ్చే పార్టీలు, వ్యక్తులకు సరైన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు, ప్రతినిధులు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, శైలజ, బీఆర్‌ఎస్ నాయకులు రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీ'లకు అద్భుత స్పందన



ప్రచారం చేస్తున్న ఆదం సంతోష్‌కుమార్

చిలకలగూడ : కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని సికింద్రాబాద్ ఆ పార్టీ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. చిలకలగూడ, గాంధీ విగ్రహం, భవానీనగర్, అన్నానగర్, కిందిబస్తీ, మైలార్‌గడ్డ, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. హస్తం గాలి వీస్తోందని, తెలంగాణతో పాటు సికింద్రాబాద్‌లో అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు. ఆయా ప్రాంత ప్రజలు ఆదం సంతోష్‌కుమార్‌కు హారతులతో స్వాగతం పలికారు. సీతాఫల్‌మండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు కొండల్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంతోష్‌కుమార్ సమక్షంలో పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు అభిషేక్, కరీముద్దీన్, రవిశంకర్, ధర్మేందర్, మహిదుద్దీన్, షకీల్‌ఖాన్, శిల్పచారి, సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారంలో పాల్గొన్న వెన్నెల

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ వెన్నెల గద్దర్ అన్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేస్తూ మాట్లాడారు. సరైన వాళ్లకు ఓటేస్తేనే రామ రాజ్యం వస్తుందన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యదిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో కర్ణాటక సోషల్ వెల్ఫేర్ మాజీ మంత్రి ఆంజనేయులు, పీసీసీ జాయింట్ సెక్రటరీ చిప్పగిరి లక్ష్మినారాయణ, ఏపీసీసీ సెక్రటరీ మల్లికార్జున, ఇంద్రసేనారెడ్డి, రమాకాంత్, అశోక్, లింగం, మహేందర్, సుదర్శన్ బాబు, శంకర్ బాబు, సురేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని పార్టీ ఇంచార్జి ఎంఎన్. శ్రీనివాస్ తెలిపారు. శనివారం రెండో వార్డు ఇందిరమ్మనగర్, బీరప్పగుడి, అర్జున్‌నగర్,అన్నానగర్‌కు చెందిన పలువురు బస్తీవాసులు, యువకులు శ్రీనివాస్, నివేదిత సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ తెరవెనుక కుమ్మక్కై ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత ఓడించేందుకు బీజేపీ నాయకులు తమ డబ్బులతో ముస్లిం మైనార్టీల ఓట్లు కొనుగోలు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేసేలా కుట్రకు తెరలేపారని ఆరోపించారు. .కుమార్, దేవులపల్లి శ్రీనివాస్, శ్రీకాంత్, అరుణ్, సాయికుమార్, రాజు, భాగ్యలక్ష్మి, రాణి, శిరీషా, మౌనికా, లక్ష్మి నర్సింహా, మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కరాటేలో అమరావతి విద్యార్థుల ప్రతిభ



చిలకలగూడ: తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో శనివారం జరిగిన హైదరాబాద్ జిల్లాస్థాయి కరాటే పోటీల్లో సికింద్రాబాద్ అమరావతి విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. అండర్–14 విభాగంలో బండి అజయ్ కుమార్, అండర్–17 విభాగంలో నోముల శశాంత్ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతులు సాధించారు. విజేతలు అజయ్‌కుమార్, శశాంత్‌లకు అమరావతి విద్యాసంస్థల నిర్వాహకులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి అభినందించారు.

పోషక ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

లాలాపేట: తార్నాకలోని ఐసీఎంఆర్–ఎన్ఐఎన్ ఆడిటోరియంలో న్యూట్రీషన్ సొసైటీ ఆఫ్ ఇండియా 55 వార్షికోత్సవం రెండు రోజుల సదస్సు శనివారం ప్రారంభమైంది. పోషక ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే థీమ్‌తో నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవానికి భారత ప్రభుత్వ నీతి అయోగ్ సీనియర్ సలహాదారు డాక్టర్ నీలం పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అనే ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. మిల్లెట్‌లు పొవర్ హౌజ్‌గా దాని ప్రాముఖ్యతను గుర్తిస్తూ 2018ని కేంద్ర ప్రభుత్వం మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిందన్నారు.

ఇదీ మా మాట..

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకుంటోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. తమ పార్టీ గుర్తుకే ఓటేయాలని హోరెత్తిస్తున్నారు. పలు మతాలు, కులాలు, వర్గాలు, రైల్వే కార్మికులు, లేబర్ అడ్డాలతో విభిన్న సంస్కృతిని ప్రతిబింబించే సికింద్రాబాద్, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. సామాన్య ఓటరు తరుపున మీకే ఎందుకు ఓటేయాలని ప్రధాన పార్టీల అభ్యర్థులను 'సాక్షి' ప్రశ్నించగా వారిచ్చిన సమాధాలు ఇవి. –చిలకలగూడ ,కంటోన్మెంట్

దశాబ్దాల పెండింగ్ సమస్యలను పరిష్కరించా

తీగుళ్ల పద్మారావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి





సికింద్రాబాద్ నియోజకవర్గంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను కేవలం తొమ్మిదిన్నరేళ్లలో పరిష్కరించా. అన్ని రంగాల్లోనూ సికింద్రాబాద్‌ను అభివృద్ధి చేశా. బీఆర్‌ఎస్ ప్రవేశ పెట్టిన డబుల్ బెడ్రూమ్, దళితబంధు, బీసీ బంధు, సీఎంఆర్‌ఎఫ్ వంటి అనేక సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని అర్హులందరికీ అందేలా చేశా. జూనియర్, డిగ్రీ కాలేజీలు, వంద పడకల ఆస్పత్రి, ఆర్‌యూబీ, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లు, స్టేడియం, సెట్విన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుతోపాటు సకల సదుపాయాలు, ఆధునిక హంగులతో నూతన భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నా తోపాటు క్యాంపు కార్యాలయం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటోంది.

అసలైన అభివృద్ధి చేసి చూపిస్తా

మేకల సారంగపాణి, బీజేపీ అభ్యర్థి



ఒక్కసారి అవకాశం ఇస్తే అసలైన అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా. నిరంతరం ప్రజలతో సత్సంబంధాలు కలిగిన నాకు ఎన్నికల ప్రచారంలో ఎక్కడికెళ్లినా ప్రజా సమస్యలే కనిపిస్తున్నాయి. గుంతలు పడిన అంతర్గత రహదారులు, కలుషిత జలాలు, వీధి దీపాలు, దోమలు, శునకాల స్వైర విహారం, మంచినీటి సమస్యలు, రేషన్‌కార్డులు ఒకటేమిటి ఇలా అన్ని సమస్యలతో సామాన్యుడు సతమతమవుతున్నాడు. బీఆర్‌ఎస్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యేపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ పట్ల ప్రజలు అత్యంత విశ్వాసంతో ఉన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతా

ఆదం సంతోష్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి



సికింద్రాబాద్ నియోజకవర్గంలో పుట్టి పెరిగిన నాకు స్థానికత ప్రధాన బలం. నా బలగం అంతా ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలే. గత మూడున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ అన్నివర్గాల ప్రజలకు చేరువయ్యాను. ఈమారు సికింద్రాబాద్‌లో సమర్థవంతమైన నాయకత్వం ఉండాలని భావించి కాంగ్రెస్ పార్టీ నాకు టికెట్ కేటాయించింది. కాంగ్రెస్ మేనిఫెస్టోను అమలు చేయడంతోపాటు, ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలుచేసి అర్హులైన వారందరికీ అందిస్తా. ఒకమారు అవకాశం ఇస్తే నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తా.

బీఆర్‌ఎస్ పథకాలు కొనసాగాలంటే..

లాస్య నందిత, బీఆర్‌ఎస్ అభ్యర్థి





దివంగత ఎమ్మెల్యే సాయన్న ఐదుసార్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా పనిచేసి ఎంతో సేవ చేశారు. పార్టీలకు అతీతంగా ఆయనకు పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు. వివిధ పథకాల ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి వేలాది మంది ప్రత్యక్ష, పరోక్షంగా లబ్ధిపొందారు. సాయన్న ఆశయాలు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం యథావిధిగా కొనసాగాలంటే కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా తనను గెలపించాలి.

ఆరు గ్యారంటీలతో ఎంతో లబ్ధి

జీవీ వెన్నెల, కాంగ్రెస్ అభ్యర్థి



దివంగత నేత గద్దర్ కూతురిగా, ఉన్నత విద్యావంతురాలిగా పేదల కష్టాలపై స్పష్టమైన అవగాహన ఉంది. ముఖ్యంగా మిలటరీ ఆధిపత్యంలో కొనసాగుతున్న కంటోన్మెంట్‌లో బస్తీవాసులు పడుతున్న ఇబ్బందులను చూస్తూనే పెరిగాను. ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందని ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నా. గద్దర్ ఆశయాలు, కాంగ్రెస్ పట్ల ప్రజల విశ్వాసంతో ఎమ్మెల్యేగా గెలిపించాలి.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

శ్రీగణేశ్, బీజేపీ అభ్యర్థి



రాజకీయాల్లోనూ వారసత్వాలను ప్రోత్సహిస్తూ నెపొటిజాన్ని సమర్థించే వాళ్లకు ఒక్కటే చెబుతున్నా.. నిజమైన ప్రజా సేవకులనే ఎమ్మెల్యేగా ఎన్నుకుంటేనే ప్రభుత్వ పథకాలు నిష్పక్షపాతంగా అర్హులకు అందుతాయి. పన్నెండేళ్లుగా నిత్యం కంటోన్మెంట్ ప్రజల మధ్యే ఉంటూ బస్తీలు, ప్రాంతాల వారీగా అందరి సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉంది. శ్రీగణేశ్ ఫౌండేషన్‌తో కొంత మేరకు సేవ చేసినప్పటికీ, ఎమ్మెల్యేగా గెలిపిస్తే పూర్తిస్థాయిలో పేదల కష్టాలు తీర్చడంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని విధాలు అభివృద్ధి చేస్తా.

అభివృద్ధి చేశా.. ఓటేసి ఆశీర్వదించండి

సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తలసాని

అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా.. మీ సమస్యలన్నీ తీర్చా మీ ఓటును కారు గుర్తు పై వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి అమీర్‌పేట డివిజన్ బీజేఆర్‌నగర్ 2లో ఇంటింటి ప్రచారం చేశారు.ప్రజలు ఆయనకు స్వాగతం పలుకుతూ మా ఓటు నీకే సీనన్నా అంటూ మద్దతు పలికారు. శ్రీనికేతన్ అపార్ట్‌మెంట్, లీలానగర్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు. తలసాని మాట్లాడుతూ.. తన కన్నా ముందు ఇక్కడి నుండి గెలిచి ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి, ఆయన కుమారుడు 4 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి ఉన్నత పదవులు అనుభవించి కూడా నియోజకవర్గాన్ని గాలికొదిలేశారని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.1400 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు చేశామన్నారు. నామన శేషుకుమారి, నీరజ్,చందన్, వేణుగోపాల్,పార్టీ నేతలు హనుమంత్‌రావు, లలితగోపీచౌహన్, పీయుష్‌గుప్తా,గులాబ్‌సింగ్, శర్మ,వెంకట రాజాం,అజయ్,అశోక్‌యాదవ్,షాబాద్ సత్యనారాయణ పాల్గొన్నారు.



బేగంపేట డివిజన్ పరిధిలో..

సనత్‌నగర్: నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే తనను మరోసారి గెలిపించాల్సిందిగా బీఆర్‌ఎస్ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ పరిధిలోని ఓల్డ్ పాటిగడ్డ, నూర్‌బాగ్‌లలో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే కనిపించే నేతల మాటలను నమ్మవద్దన్నారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో 70 వేల ఇళ్లను ఇచ్చామని, రాని వారు అధైర్య పడొద్దని దశలవారీగా అర్హులందరికీ అందజేస్తామన్నారు. మంత్రి వెంట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్ ఉప్పల తరుణి, నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్, నరేందర్, శేఖర్, మొహిన్, అజ్మత్, అఖిల్, జావీద్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి..

కంటోన్మెంట్: గులాబీ పార్టీతోనే కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. శనివారం నియోజకవర్గ ఎన్నికలపై నిర్వహించిన కీలక సమావేశంలో ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహంపై కీలక సూచనలు చేశారు. కంటోన్మెంట్ అభ్యర్థి లాస్యనందిత విజయం లాంఛనమేనని ధీమా వ్యక్తం చేశారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న చొరవతో కంటోన్మెంట్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా టీఎమ్మార్పీఎస్ తో పాటు మాల సంఘాల జేఏసీ నేతలు తలసానిని కలిసి లాస్య నందితకు మద్దతు ప్రకటించారు. గజ్జెల నాగేశ్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోకనాథం పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణం బీజేపీతోనే సాధ్యం

సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి



తనకు ఓటేయాలని కోరుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: సమసమాజ నిర్మాణం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సనత్‌నగర్ ఎస్ఆర్‌టీకాలనీలో శనివారం ఆయన ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయ్యాలని కొందరు బీఆర్‌ఎస్ కార్యకర్తలు అసంబద్ధ ప్రచారానికి తెర తీస్తున్నారని, ఇది ఎంతమాత్రం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం ఉండాలన్నారు. పార్లమెంట్‌తో పాటు రాజ్యసభలో కూడా బీజేపీ సభ్యుల సంఖ్య పూర్తిగా ఉంటేనే ఎలాంటి అభివృద్ధి బిల్లునైనా నెగ్గించుకోగలమన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. తాను ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడే నేతలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో సంక్షేమ పథకాలు కూడా తమ కార్యకర్తలు, తమకు అనుకూలంగా ఉన్నవారికే అందిస్తున్నారే తప్ప నిజమైన అర్హులకు అందడం లేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కుల, ప్రాంత, మతాలకతీతంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూశానన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేయడంతో పాటు ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో కస్నూరి క్రాంతికుమార్, మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివయాదవ్, సీనియర్ నాయకులు దయానంద్, లింగంపల్లి నర్సింగ్‌రావు, రావుల లక్ష్మీనారాయణ, సునీల్‌కుమార్, ఆకుల మహేష్, చంద్రకుమార్, కేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, వంశీ పాల్గొన్నారు.



కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి



రోడ్‌షోలో పాల్గొన్న జేపీ నడ్డా, పక్కనే సారంగపాణి

చిలకలగూడ: కుటుంబ పాలనకు చరమగీతం పాడి బంగారు తెలంగాణ ఆవిష్కరించాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణికి మద్దతుగా ఆయన శనివారం చిలకలగూడ నుంచి వారాసిగూడ వరకు రోడ్‌షో నిర్వహించి బీజేపీకి ఓటేసి సారంగపాణిని గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. కుటుంబ పార్టీ, స్కామ్‌లు చేసే పార్టీలను నమ్మవద్దన్నారు. బంగారు తెలంగాణ పేరిట ప్రజలను మభ్యపెట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ భూములను అమ్ముకోవడం, రింగ్‌రోడ్ టెండర్లలో అవినీతికి పాల్పడిందని, దళిత సీఎం చేస్తానని చెప్పిన కేసీఆర్ దళితులను మోసగించాడని విమర్శించారు. తెలంగాణలో బీసీని సీఎం చేస్తానని మొదటిగా ప్రటించిది బీజేపీ యేనని కాంగ్రెస్ అంటే అవినీతికి నిలువుటద్దమన్నారు. సైలెంట్ ఓటింగ్‌తో సికింద్రాబాద్‌లో విజయం సాధిస్తామని మేకల సారంగపాణి ధీమా వ్యక్తం చేశారు. మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి నాయకులు నాగేశ్వరరెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, మేకల కీర్తిహర్షకిరణ్, ప్రభుగుప్తా, గణేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో శ్రీగణేశ్‌దే గెలుపు



నాయకులతో మాట్లాడుతున్న ప్రకాశ్ జవదేకర్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం ఖాయమని బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎంపీ ప్రకాశ్ జవదేకర్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, గోవా బీపీపీ అధ్యక్షుడు సదానంద్ తన్వాడే, మహారాష్ట్ర ఎమ్మెల్సీ రామ్ షిండేతో కలిసి ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కంటోన్మెంట్‌లో బీజేపీ గెలిస్తే అభివృద్ధి రెట్టింపు అవుతుందని సూచించారు.

విశ్రాంత ప్రొ. అన్వర్ మోజామ్ మృతి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కళాశాలకు చెందిన విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్వర్ మోజామ్ (94) శనివారం సాయంత్రం కన్నుమూశారు. ఇస్లామిక్ స్టడీస్ విభాగం అధ్యాపకులు, హెడ్‌గా పని చేసిన ఆయన రచయిత పేరుగాంచారు. రాత్రి బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్.12లోని మసీద్ ఈ–బక్వీలో అంత్యక్రియలు జరిగాయని ఓయూ అధికార వర్గాలు పేర్కొన్నారు.

కారు ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలి మృతి



రసూల్‌పురా: వేగంగా దూసుకొచ్చిన కారు ఓ పారిశుద్ధ్య కార్మికురాలి ప్రాణాలు బలిగొన్న ఘటన తిరుమలగిరి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శేఖర్ వివరాల ప్రకారం.. మచ్చబొల్లారానికి చెందిన కళమ్మ (38) అల్వాల్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. శనివారం ఉదయం టీచర్స్ కాలనీలో స్వీపింగ్ చేస్తుండగా సికింద్రాబాద్ సింధీకాలనీకి చెందిన అర్యాన్ మాల్వే (21) తన బ్రెజా కారులో అతి వేగంగా వెళ్తూ స్వీపింగ్ చేస్తున్న కళను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది.



నీలిమను గెలిపించండి..

సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమకు మద్దతుకు బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రునగర్‌లో శనివారం జరిగిన రోడ్ షో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొని ప్రసంగించారు. సనత్‌నగర్‌లో బీఆర్‌ఎస్ రౌడీరాజ్యం గుండాయిజం పోవాలంటే కాంగ్రెస్ అభ్యర్థి నీలిమను గెలిపించాలని కోరారు.
–బన్సీలాల్‌పేట్



'మర్రి'కి మద్దతివ్వండి..

సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డికి మద్దతుగా సికింద్రాబాద్ మహంకాళి టెంపుల్ వద్ద శనివారం నిర్వహించిన రోడ్‌షోలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొని మర్రి శశిధర్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు.
–సనత్‌నగర్